సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

ఇంటికే పౌష్టికాహారం

- టేక్ హోమ్ రేషన్‌తో ఎంతో మేలు
- అంగన్‌వాడీ కేంద్రాల్లో చురుగ్గా పంపిణీ
- గర్భిణులు, బాలింతల హర్షం


గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న టీచర్, సిబ్బంది(ఫైల్)

మద్రిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రారంభించిన టేక్ హోమ్ రేషన్(టీహెచ్‌ఆర్) పథకం గర్భిణులు, బాలింతలకు మేలు చేస్తోంది. ఇది వరకు గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పోషకాహారం తీసుకునేవారు. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా లబ్ధిదారులకు సంపూర్ణ పౌష్టికాహార టేక్ హోమ్ రేషన్ కిట్లు అందిస్తోంది. జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు ఈ ప్రయోజనాన్ని అందిపుచ్చుకుంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సెంటర్ పరిధిలో 32 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. ప్రభుత్వం ఫేస్ యాప్ ద్వారా వీరికి రేషన్ అందజేస్తోంది. లబ్ధిదారులు ప్రతి నెలా రెండు సార్లు కేంద్రానికి వచ్చి యాప్ ద్వారా హాజరు వేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ అంగన్‌వాడీ కేంద్రంలో టేక్ హోమ్ రేషన్ తీసుకుంటున్న వారి హాజరు శాతం కూడా బాగానే ఉంది. 53వ వార్డు మద్రిపాలెం శివనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో టీహెచ్‌ఆర్ కిట్లు అందుకుంటున్న బాలింతలు, గర్భిణులు ఈ విధానం చాలా బాగుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.


గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటరమణ(ఫైల్)

ఆటపాటలతో విద్యా బోధన

గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో 7 నెలల నుంచి మూడేళ్ల లోపు 115 మంది చిన్నారులు ఉన్నారు. వీరికి పౌష్టికాహారంగా 25 గుడ్లు, బాలామృతం 2.5 కేజీలు, పాలు 2.5 లీటర్లు వారి తల్లులకు అందిస్తున్నారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల చిన్నారులకు అక్కడే స్కూల్‌లోనే పాఠాలు బోధిస్తూ, రోజూ మెనూ ప్రకారం పోషకాహారం పెడుతున్నారు. ఏ రోజూ మెనూ ఆరోజు పెడుతూ గుడ్లు, పాలు అదనంగా అక్కడే ఇస్తారు. అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు ఆటలు, పాటలు నేర్పిస్తూ చిన్నారులతో సరదాగా గడుపుతున్నారు.

గర్భిణులకు సీమంతాలు

ఈ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పుట్టింటి తరహాలోనే సీమంతాలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుక కోసం ముందుగానే రిజిస్టర్ చేసుకోవాలి. ఈ కేంద్రంలో ఈ ఏడాదిలో రెండు సార్లు సీమంతాలు నిర్వహించారు. గర్భిణులకు బొట్టు పెట్టి గాజులు తొడిగి పండ్లు, జాకెట్టు క్లాత్ అందిస్తారు. దాతలు ఎవరైనా సహాయం సాస్తే చీర కూడా ఇస్తారు. సీమంతం చేయడంతో గర్భిణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టీహెచ్‌ఆర్ కిట్‌లో సరకులు

కందిపప్పు కేజీ, నాణ్యమైన బియ్యం 3 కేజీలు, నూనె అర కేజీ, పాలు 5 లీటర్లు, గుడ్లు 25, రాగి పిండి 2 కేజీలు, అటుకులు కేజీ, బెల్లం పావుకేజీ, పలుకుల చెక్కీ పావు కేజీ, ఖర్జూరం పావు కేజీ.. ఇవన్నీ టేక్ హోమ్ రేషన్ వైఎస్సార్ కిట్‌గా లబ్ధిదారులకు అందజేస్తున్నారు.

లబ్ధిదారుల్లో ఆనందం



గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం నేరుగా పౌష్టికాహార కిట్లు అందిస్తున్నందుకు లబ్ధిదారులు ఎంతగానో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సంపూర్ణ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల మాతా, శిశు మరణాలు తగ్గుముఖం పడతాయి. మహిళల్లో రక్తహీనత సమస్య తగ్గుతుంది. తద్వారా పిల్లలు ఆరోగ్యంగా పుడతారు. పౌష్టికాహార లోపంతో పుట్టే పిల్లల సంఖ్యను కూడా తగ్గించగలుగుతాం.

– ఎం.వి.రమణకుమారి, సీడీపీవో, విశాఖ అర్బన్

టేక్ హోమ్ రేషన్ ఎంతో బాగుంది



ప్రభుత్వం అందిస్తున్న టేక్ హోమ్ రేషన్ కార్యక్రమం ఎంతో బాగుంది. పాప పుట్టి రెండు నెలలు అయ్యింది. ప్రసవానికి ముందు, తర్వాత కూడా సంపూర్ణమైన పోషకాలు కలిగిన ఆహార కిట్లను అందిస్తున్నారు.

– లావణ్య, శ్రీరాంనగర్, 53వ వార్డు

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా పోషణ మాసోత్సవం


అంగన్‌వాడీ లబ్ధిదారులకు సూచనలిస్తున్న గొండు సీతారాం

మద్రిపాలెం: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా పోషణ మాసోత్సవం ముందుకు సాగుతోందని రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఆర్ అండ్ బీ దరి శ్రీరాంనగర్‌లోని ఐసీడీఎస్ మద్రిపాలెం కార్యాలయంలో సీడీపీవో రమణకుమారి, అదనపు సీడీపీవో శ్రీలత నేతృత్వంలో అంగన్‌వాడీలు బుధవారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహార స్టాళ్లను ఆయన పరిశీలించి అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహారంలో వినియోగిస్తున్న నిత్యావసర సరకులు, ఆకుకూరల వినియోగంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ చిన్నారులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత, బరువు లోపాలు లేకుండా చేసేందుకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నాయని చెప్పారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా సెప్టెంబర్ మాసాన్ని పోషణ మాసోత్సవంగా నిర్వహిస్తున్నారని వివరించారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా ఈ నెల 1 నుంచి 30 వరకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. అనంతరం నిర్వహించిన 'వెల్ బేబీ షో'లో చిన్నారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా సచివాలయం కోఆర్డినేటర్ ప్రసాద్, ఐసీడీఎస్ డీసీపీవో రమేష్, సీఆర్‌పీఎస్ భాగ్యలక్ష్మి శైలజ, సూపర్‌వైజర్లు జె.టి.ఎ న్.జ్యోతి, కుమారి, వెన్నిసా, సిల్వియా, వరలక్ష్మి,అధిక సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

పేడాడ రమణికుమారికి సత్కారం


రమణికుమారిని సత్కరిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: శ్రీకాకుళం అంబేడ్కర్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలిగా నియమితులైన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు పేడాడ రమణికుమారికి నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్‌రాజు, కంపా హనోకు, నాయకులు కిరణ్‌రాజు, పైడి రమణ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు


అక్కయ్యపాలెంలో పందిరి రాట వేస్తున్న నిర్వాహకులు


లక్ష్మీ వినాయక ఆలయంలో ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న అర్చకులు, అతిథులు

సీతంపేట: న్యూ ఫ్రెండ్స్ సంపత్ వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అక్కయ్యపాలెం ఎన్‌టీ స్కూల్ రోడ్డులోని సరోజ ఆస్పత్రి కూడలిలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు ముత్తయిదువులు ముహూర్తపు రాట వేశారు. 33 ఏళ్లుగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది తొమ్మిది రోజుల పాటు విశేష పూజా కార్యక్రమాలు జరుపుతామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

ఆహ్వాన పత్రికావిష్కరణ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల లక్ష్మీవినాయక ఆలయంలో జరిగే వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను బుధవారం అర్చకుడు బాలానంద శివాచార్య స్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 26 వరకు వినాయక నవరాత్రి మహోత్సవాలు ఆలయ ప్రాంగణంలో శైవాగమ సంప్రదాయంలో విశేష పూజా, సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తొమ్మిది రోజుల పాటు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్, యు.ఎస్.శర్మ, రైల్వే మూర్తి, జీఎస్టీ వేణుగోపాల్, గురుపాద సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూపుదిద్దుకుంటున్న 108 అడుగుల గణనాథుడు


దొండపర్తిలో రూపుదిద్దుకుంటున్న భారీ గణపతి విగ్రహం

సీతమ్మధార: వైఎస్ జగన్ యువసేన ఆధ్వర్యంలో దొండపర్తిలోని రామాలయం వద్ద 108 అడుగుల భారీ గణనాథుడి విగ్రహం ఏర్పాటుకు శరవేగంగా పనులు జరుగుతున్నాయి. మరో మూడు రోజుల్లో మొత్తం ఏర్పాట్లు పూర్తవుతాయని నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఖర్గపూర్‌కు చెందిన కళాకారుడు శక్తిపాల్ బృందం ఈ భారీ వినాయకుడి విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. గతేడాది 102 అడుగుల గణపతిని రూపొందించామని, ఈసారి 108 అడుగుల గణనాథుడిని ప్రతిష్ఠించనున్నట్లు సర్వేశ్వరరెడ్డి తెలిపారు. ఈ నెల 18 నుంచి 21 రోజుల పాటు గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. తమ బృందం రూ.5 లక్షల సొంత నిధులతో ఈ భారీ గణపతిని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

పోలీసుల అదుపులో టీడీపీ నాయకులు

సీతమ్మధార/మురళీనగర్: మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో బుధవారం 10 మంది టీడీపీ నాయకులను ఫోర్త్ టౌన్ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని వదిలేశారు. ఎటువంటి అల్లర్లు జరగకుండా చర్యలు చేపట్టారు. టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు, పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి సనపల వరప్రసాద్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. పార్టీ పిలుపునిచ్చిన 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా నిరాహార దీక్షకు వెళ్తున్న ఆయనను హౌస్ అరెస్ట్ చేయడంతో తన ఇంటి వద్ద నల్లబ్యాడ్జీతో వరప్రసాద్ నిరసన తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. దయానంద్‌నగర్ చాకలిగెడ్డలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న దమరసింగి కృష్ణ(35)లేబర్ పని చేస్తుంటాడు. మూడు నెలల కిందట అతడి భార్య ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లి తిరిగిరాలేదు. పదే పదే రమ్మని అడుగుతున్నా ఆమె రావడానికి నిరాకరించింది. మంగళవారం రాత్రి 9 గంటల తర్వాత నిద్రపోవడానికి గదిలోకి వెళ్లాడు. బుధవారం ఉదయం సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి తండ్రి దమరసింగి కనకరాజు ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్ఐ రవికిషోర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్ధరాత్రి వరకు తెరిచి ఉన్న షాపులు


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో అర్ధరాత్రి వేళ తెరిచి ఉన్న షాపు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు చోట్ల అర్ధరాత్రి 1.30 గంటల వరకు షాపులు తెరిచి ఉంటున్నాయి. రాత్రి 10.30 గంటల తరువాత ఎక్కడ షాపులు తెరిచి ఉండకూడదని పోలీసులు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ కొందరు షాపుల యాజమానుల తీరు మారడం లేదు. నగరంలో 144 సెక్షన్, 30 అమలులో ఉన్నప్పటికీ నక్కవానిపాలెం, గాంధీనగర్, బాలయ్యశాస్త్రి లేఅవుట్ ప్రాంతాల్లో పలు దుకాణాలు అర్ధరాత్రి వేళలో తెరిచి ఉంటున్నాయి. బాలయ్యశాస్త్రి లేఅవుట్, గాంధీనగర్‌ల్లో షాపులు మూయడం లేదు. గతంలో షాపుల యాజమానులను ద్వారకా పోలీసులు పిలిపించి చెప్పినప్పటికీ వినడం లేదు. అర్ధరాత్రి వేళ తెరిచి ఉన్న షాపుల వద్ద మందుబాబులు చేరి గొడవలు చేస్తున్నారు. రాత్రి గస్తీ నిర్వహించే పోలీసులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పేదల ఆర్థికాభ్యున్నతే సీఎం ధ్యేయం


కూరగాయల వ్యాపారికి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: పేదలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 14వ వార్డు నర్సింహనగర్, సచివాలయం-1(1086251) పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్‌రాజుతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం జగన్ పాలనపై ప్రతి గడపలో లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారని, తమ ప్రభుత్వ పారదర్శక పాలనకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, డైరెక్టర్ నూకరాజు, కిరణ్‌రాజు, బల్లా శ్రీను, కె.సత్యనారాయణ, కె.సుశీల, రాజ్‌కుమారి, ఎం.శ్రీను, తాడి వెంకటరెడ్డి, రమణమూర్తి, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్'

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు వార్డులకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి, కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మిగిలిన వినతులను సంబంధిత అధికారులకు పంపి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొత్త పెన్షన్ల పంపిణీ


46వ వార్డులో కొత్త పింఛన్లు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్


లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తున్న 50వ వార్డు నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు శాంతినగర్ సచివాలయంలో బుధవారం కొత్తగా మంజూరైన వైఎస్సార్ పెన్షన్ కానుకను అవ్వాతాతలు, వృద్ధులు, దివ్యాంగులకు డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ అవ్వాతాతల మోములో చిరునవ్వు కనిపించడంతోపాటు రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని ఆనందం వ్యక్తం చేశారన్నారు. సుమారు 43 కొత్త పెన్షన్లు మంజూరైనట్లు ఏపీడీ పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో బి.గోవింద్, కె.చిన్నా, ఈశ్వరరావు, రామారావు, లావణ్య, శ్రీను, దుర్గాభవాని, జి.అప్పారావు, దేవి, విజయలక్ష్మి, సచివాయల సిబ్బంది, కన్వీనర్లు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

50వ వార్డులో..

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు కార్యాలయం వద్ద బుధవారం కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ సూచనల మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు రెండో విడత పింఛన్లను పలువురు లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సంక్షేమ కార్యదర్శులు జ్యోతి, స్వామినాయుడు, విజయలక్ష్మి, హరిత, వార్డు నాయకులు పైడి కృష్ణారావు మాస్టరు, సునీత, సనపల నారాయణస్వామి, పాతపట్నం రామ్మోహన్, ఏవీఎస్ రాజు, ప్రసూనా రెడ్డి, సబ్బవరపు శ్రీనివాస్, పొన్నాడ అప్పారావు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

ఒక వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార: శాంతిపురానికి చెందిన ఒక యువకుడిపై జరిగిన దాడి ఘటనపై ఫోర్త్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి ఒకరిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం శాంతిపురం రామకృష్ణానగర్ క్రాస్ బేకరీ ఎదురుగా ఉంటున్న వెంకటేష్ అనే యువకుడు స్నేహితుల దినోత్సవం రోజున ఆదే ప్రాంతానికి చెందిన మెకానిక్ నాగు అనే యువకుడి మధ్య గొడవ జరిగింది. అప్పటి నుంచి వెంకటేష్ అతడితో మాట్లాడటం మానేశాడు. ఈక్రమంలో సోమవారం వెంకటేష్ వద్దకు వచ్చి దుర్భాషలాడిన నాగు, మరో వ్యక్తితో కలిసి యువకుడి మొహంపై పిడుగుద్దులు గుద్ది దాడి చేశారు. వెంకటేష్ దవడ భాగం పూర్తిగా దెబ్బతినడంతో అపస్మారక స్థితిలోకి చేరాడు. ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబ సభ్యుల ఎదుట కొట్టడంతో వెంకటేష్ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనకు సంబంధించి ఒకరిపైనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. మరో వ్యక్తిని వదిలేశారని బాధితుడి కుటుంబ సభ్యులు వాపోచారు.

అంబరాన్నంటిన జానపద సంబరాలు


ఆకట్టుకున్న గణనాయక నృత్య ప్రదర్శన


హరిశ్చంద్ర నాటకంలో కళాకారులు

సీతంపేట: నవచైతన్య కళానాట్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన జానపద సంబరాలు అంబరాన్నంటాయి. కళాకారులు ప్రదర్శించిన వివిధ జానపద అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. లీడర్ సంపాదకుడు వి.వి.రమణమూర్తి, కొణతాల రాజు, ఎం.వి.రాజశేఖర్, బాదంగీర్ సాయి, సిహెచ్.సత్యనారాయణ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ కానపద కళలను నమ్ముకుంటూ జీవిస్తున్న కళాకారులను ఆదరించాలన్నారు. దేశ సంప్రదాయానికి ప్రతీకగా జానపద కళలు నిలిచాయన్నారు. జానపద కళారూపాలతో సమావేశ ప్రాంగణంలో సందడి నెలకొంది. రంగస్థల నటుడు మారుతీ ప్రసాద్ ప్రదర్శించిన హరిశ్చంద్ర నాటకం, గణనాయక నృత్యం, ఆంధ్ర జాలరి నృత్యరూపకం, భక్తప్రహ్లాద నృత్యరూపకం, వీరబాహుడు సన్నివేశం, శివతాండవం విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు పిల్లి వీర్రాజు, వి.ప్రభాకర్, ఎం.ఎస్.మాధవ్, మేడా మస్తాన్‌రెడ్డి, పలువురు కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే హక్కుల సాధన


శివప్రసాద్‌రాజుకు నియామక పత్రం అందిస్తున్న బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

సీతంపేట: రాష్ట్రంలో బీసీలకు, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు ప్రాతినిధ్యం వహిస్తూ 2024 ఎన్నికల్లో పోటీ చేసే విషయమై గతేడాది నుంచి సన్నాహాలు చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లా రమణ అధ్యక్షతన ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వివిధ కుల సంఘాల నాయకులతో బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నూటికి 80 శాతం బహుజనులకు సరైన ప్రాతినిధ్యం లేదని, రిజర్వేషన్లు ఉన్నప్పటికీ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రాతినిధ్యం లభించడం లేదన్నారు. చట్టసభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు లేని కారణంగా 25 శాతం స్థానాలు కూడా లభించడం లేదని పేర్కొన్నారు. రాజ్యాధికారం ద్వారానే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల హక్కులు సాధించుకోవడం సాధ్యమవుతుందన్నారు. అందుచేత ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో కలిసి బీసీ సంక్షేమ సంఘం ద్వారా రాజకీయ పార్టీ ఏర్పరచాలన్న నిర్ణయానికి అనుగుణంగా 26 జిల్లాలో ఆ దిశగా పయనిస్తున్నట్టు చెప్పారు. రానున్న ఎన్నికల్లో 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో పోటీకి సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడిదేవుల శివప్రసాద్‌రాజును విశాఖ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కామన సుబ్బారావు, మహిళాధ్యక్షురాలు కేసరి దీప్తి, ఎం.శేషగిరిరావు, యాదవ సంఘ ప్రతినిధి ఉప్పిలి అప్పలకొండ, గౌడ సంఘం నుంచి ఏవీఎస్ఎస్ మూర్తి, శ్రీశైన నుంచి తోట వాసుదేవరావు, శెట్టిబలిజ కులం నుంచి కట్టా మల్లేశ్వరరావు, మేదర కులం నుంచి పిల్లి అప్పారావు, పట్నాయక నుంచి జి.జి.ప్రభాకర్ దాసు, నగరాలు నుంచి జగ్గుపల్లి అప్పలరాజు, తెలికల నుంచి చాంద్రాడ అప్పారావు, వాడబలిజ నుంచి రమణమ్మ, పలు కుల సంఘ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

'తెలుగు భేరి' విలువైన గ్రంథం


తెలుగు భేరి గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

సీతంపేట: తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పే విలువైన గ్రంథం తెలుగు భేరి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో తెలుగుదండు వ్యవస్థాపకుడు పరవస్తు ఫణిశయన సూరి రచించిన 'తెలుగు భేరి' గ్రంథ పరిచయం, ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సాహితీవేత్త సిహెచ్.చిన సూర్యనారాయణ గ్రంథ పరిచయం చేశారు. పరిమళించే పూలను ఏరి మాలగుచ్చి తెలుగు తల్లి మెడలో వేసిన రీతిన ఫణిశయన సూరి తెలుగు భేరి గ్రంథాన్ని రచించారన్నారు. అనేక తెలుగు గ్రంథాలు చదవలేని పాఠకులు ఈ సంకలనం చదివితే చాలని చెప్పారు. దీనిలో ప్రముఖ తెలుగు కవులు రచించిన పద్యాలు, గేయాలు, వచన కవితలు, జానపదాలు ఒకచోట చేర్చబడ్డాయన్నారు. కావ్యాలు, శతకాల నుంచి ప్రక్రియలను, నన్నయ నుంచి ఆధునిక కవుల వరకు ఈ గ్రంథంలో పరిచయం చేశారని వివరించారు. శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రచయితలు డి.వి.సూర్యారావు, పరవస్తు పణిశయన సూరి, భాగవతుల సత్యనారాయణమూర్తి, రమణకొత్తూరి, కుప్పిలి భీమేశ్వరరావు, సురేష్, ఆర్.వి.ఎస్.మూర్తి, బి.రాధారాణి, ఆర్.సుబ్బలక్ష్మి, పీవీఆర్‌కే రావు, వరికొండ కాంతారావు, వేదుల కామేశ్వరశర్మ పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF PRINCIPAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
G.O.P. 16/2023

Between:
Badiyala Symala Devi, W/o B. Yethi Raju, Hindu, Aged 52 years, D.No. 39-22-19/6, Kalinga Nagar, Madhavadhara, Industrial Estate (Post), Visakhapatnam-7. ...Petitioner
And
... NILL ... ...Respondent

GENERAL NOTICE TO GENERAL PUBLIC

యిందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా Smt. Badiyala Symala Devi గారు పై కోర్టులో తమను Guardianగా Sri Badiyala Sudhakar Raju గారికి Appoint చేయమని కోరుతూ Section 10 of the Guardian & Wards Act క్రింద Petition దాఖలు చేసియున్నారు. ఎవ్వరికైననూ అభ్యంతరములు ఉన్నయెడల తేది. 20-09-2023న ఉదయం 10-30 గంటలకు స్వయంగా గాని, వకీలుద్వారా గానీ హాజరై లిఖిత పూర్వకంగా అభ్యంతరములు తెలియజేయవలసినదిగా కోర్టువారు ఆర్డర్ చేసియున్నారు. లేనియెడల పిటీషన్‌ను మీ పరోక్షమందు విమర్శచేసి తీర్మానము అగునని మీరు తెల్సుకోవలసినది.

(As per order of the Honourable Court)

విశాఖపట్నం
తేది. 11-09-2023

S.K.S.K. SARMA & R. SRINIVAS
Advocates for Petitioner
Visakhapatnam. Cell: 9849230073

ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం


అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి భక్తులు జలాభిషేకం జరిపారు. ఈ కార్యక్రమానికి దొండపర్తి, రైల్వేన్యూకాలనీ, పెదవాల్తేరు, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, శివాజీపాలెం, ఎన్ఏడీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, జగదాంబ, వన్‌టౌన్, నెహ్రూబజారు తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వయంగా పసుపునీళ్లతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారిని పసుపు, కుంకుమ, పలు రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రసాద వితరణ చేశారు.

తిమ్మాపురంలో షూటింగ్ సందడి


లొకేషన్‌లో నటుడు సప్తగిరి

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు తిమ్మాపురంలో బుధవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. సప్తగిరి, శత్రు హీరోలుగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ ఓ రిసార్ట్‌లో చిత్రీకరించారు. ఈ చిత్రానికి పి.సుబ్రహ్మణ్యం దర్శకత్వం వహిస్తున్నారు. ఇంకా టైటిల్ ఖరారు కాలేదని, మరో మూడు రోజులు బీచ్ రోడ్డు ప్రాంతంలో షూటింగ్ ఉంటుందని ఆయన తెలిపారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com